క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల లో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరీ మాత ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ప్రారంభమాయ్యాయి. ఉదయం మాగశుద్ధ చవితి గణపతి పూజ, పుణ్యాహవాచణం, మంటప ఆరాధన, ఋుత్వికరణం, యాగశాల ప్రవేశం, సాయంత్రం అమ్మవారికి మూలమంత్ర జపాదులు, నవగ్రహ జపాదులు గ్రామస్తుల ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు సంచార పశుఆరోగ్య సేవ అంబులెన్స్ ప్రారంభం

కోవెలకుంట్ల: మండల కేంద్రం సంజామలలో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ అంబులెన్స్‌ను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాడిరైతులు, గొర్రెలు, మేకల పెంపకందారుల గుమ్మం వద్దనే అనారోగ్యానికి గురైన పశువులకు వైద్యసేవలందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణు లు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలి

కోవెలకుంట్ల: కృష్ణానదిపై నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి బ్రిడ్జి, బ్యారేజీ నిర్మించాలని రాయలసీమ జా యింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి కోరారు. బుధవారం కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 167వ జాతీయ రహదారిపై కేంద్ర ప్రభుత్వం తీగలవంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు సాగునీరు పుష్కలంగా అందాలంటే తీగల వంతెన స్థానంలో బ్రిడ్జితోపాటు బ్యారేజీని ఏర్పాటు చేయాలన్నారు. ఫిబ్రవరి 22న నిర్వహించ తలపెట్టిన చలో సిద్దేశ్వరం కార్యక్రమానికి సాగునీటి ఉద్యమకారులు, నాలుగు జిల్లాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

అవుకు: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం క్యాలండర్, డైరీని బుధవారం ఎంఈఓ శ్రీధర్ రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీయూఎస్ నాయకులు శ్రీపతి, భాస్కర్, రమేష్ ,శ్రీరామచంద్రుడు, హెచ్ఎంలు సుబ్రహ్మణ్యం, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐ శేషన్నను కలిసిన మహిళా పోలీసులు



సీఐ శేషన్నకు బొకే అందజేస్తున్న

డోన్ రూరల్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ శేషన్నను సచివాలయాలలో పనిచేస్తున్న మహిళా పోలీసులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు బొకేతో అభినందనలు తెలిపారు. చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించాలని, సమస్య వచ్చినప్పుడు పోలీస్ స్టేషన్‌లకు వచ్చి ఫిర్యాదు చేసేలా చైతన్యపరచాలని ఈ సందర్భంగా సీఐ వారికి సూచించారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

డోన్ రూరల్: శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ మండల పరిధిలోని ఎద్దుపెంట ఎస్సీ కాలనీ వాసులు బుధవారం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. దశాబ్దాలుగా సెంటు స్థలంలేని శ్మశాన వాటిక సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వారు తహసీల్దార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు కేశవయ్య, శ్రీనివాసులు, సుంకన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల పరిధిలోని ప్యాపిలి, వెంగళాంపల్లి, మెట్టుపల్లి తదితర గ్రామాల్లోని షెడ్యుల్డు కులాల వారికి శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మకు జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రమేష్ వినతి పత్రం అందజేశారు. శ్మశానవాటికలు లేక ఎస్సీ, ఎస్టీలు పడుతున్న ఇబ్బందులను తహసీల్దార్‌కు రమేష్ వివరించారు. నెలకు ఓ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని కోరారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బేతంచెర్ల మార్నింగ్ క్రికెట్ టీమ్ ఆధ్వర్యంలో ఈనెల 8దీన ప్రారంభమైన జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. చివరకు బేతంచెర్ల చిరుత టీమ్, బలపాలపల్లె యువత టీమ్ మధ్యన హోరా హోరీ పోరు జరిగింది. ప్రథమ బహుమతిని బేతంచెర్ల చిరుత టీమ్ కైవసం చేసుకోగా నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి సహకారంతో రూ. 30 వేలు అందజేశారు. బలపాలపల్లె టీమ్‌కు ద్వితీయ బహుమతిని మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు సహకారంతో రూ. 20 వేలు అందజేశారు.

సంక్షేమంలో సరికొత్త అధ్యాయం

- ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: ప్రజల అభ్యున్నతికి వివిధ పథకాలను ప్రవేశపెట్టి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని ఐదవ గ్రామ సచివాలయ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో రెండోరోజు బుధవారం ఎమ్మెల్యే కాటసాని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులతో పాటు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జున రెడ్డి, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎల్‌వీసీ రామసుబ్బారెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, శ్రీనివాసనాయక్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. దాదాపు 350 గడపలను సందర్శించిన ఎమ్మెల్యే ఆయా కుటుంబాల సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అందరినీ ఆప్యాయంగా పలుకరించిన కాటసాని మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి ఇంకా ఏవైనా పథకాలు అందలేదా... అనే వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్దిదారులకు అందజేశారు. ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ, అంతర్గత రోడ్లు, మంచి సరఫరా తదితర మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అర్హతే ప్రామాణికం

గ్రామ సచివాలయ, వలంటీర వ్యవస్థల ద్వారా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. పేదల అభ్యున్నలే లక్ష్యంగా ప్రభుత్వం నవరత్న పథకాలు అమలు చేస్తోందని, అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, ఆసరా, నేతన్న నేస్తం, వసతి, విద్యాదీవెనలు తదితర 32 సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరుతోందన్నారు. జగనన్న పాలన దేశంలో ఒక సువర్ణ అధ్యాయమన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తుండటాన్ని ప్రతిపక్ష టీడీపీ జీర్ణించుకోలేక పోతోందని విమర్శించారు. అసత్యారోణలకు పాల్పడుతూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు లోకేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, బాలమద్దిలేటి, మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఈఓఆర్డీ రాధిక, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో ఏఈలు హరీష్, రామసుబ్రహ్మణ్యం, మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ బాలాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గువ్వల రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థల తోడ్పాటు అభినందనీయం



మంత్రి బుగ్గనకు ఆయన తండ్రి రామనాథ్ రెడ్డి చిత్ర పటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: సమాజ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటుగా నిస్వార్థంగా స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య బళ్లాని, గుప్త, ఆర్యవైశ్యులు గుండా గోపాలు, కందగడ్డల మోహన్ రావు రాజేంద్ర, విష్ణు, జనార్ధన్ ధనుంజయ తదితరులు బుధవారం మంత్రి బుగ్గనను ఆయన స్వగృహంలో కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి పూలమాలలు వేసి సత్కరించారు. అదేవిధంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ఆయన తండ్రి రామనాథ్ రెడ్డి చిత్ర పటాన్ని బహూకరించారు.

డ్రిప్ పైపుల దొంగలు అరెస్టు

- బొలెరో వాహనం, పైపులు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

ప్యాపిలి: ప్యాపిలి, డోన్ తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో కొద్దిరోజులుగా డ్రిప్ పైపులను అపహరిస్తున్న నిందితులను బుధవారం జలదుర్గం ఎస్ఐ నరేష్ అరెస్టు చేశారు. సీఐ శ్రీరాములు స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ప్యాపిలి, తుగ్గలి, బనగానపల్లె మండలాలకు చెందిన షేక్ షఫీ, మధు శేఖర్, ఓబులేసు, నరేష్, మన్సూర్, సూర్య ప్రకాశ్, షేక్షావలి, సమీర్, మధు హుసేన్ తదితరులు బొలెరో వాహనంలో టమాట లోడ్‌ను మార్కెట్‌కు తరలించే హమాలీలుగా పని చేస్తున్నారు. లోడ్ ఎత్తేందుకు రైతుల పొలాలకు వెళ్తున్న వీరు డ్రిప్ పైపుల మీద కన్నేశారు. అపహరించిన పైపులను అనంతపురంలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బాధిత రైతులు శివలింగన్న, వెంకటరమణయ్య, నారాయణ, పక్కీరప్ప, రాముడు తదితరులు జలదుర్గం, ప్యాపిలి పోలీస్ స్టేషన్‌లలో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా...

ప్యాపిలి మండలం గార్లదిన్నెలో జలదుర్గం ఎస్ఐ నరేష్ బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రిప్ పైపుల లోడ్‌తో వచ్చిన బొలెరో వాహనాన్ని ఆపారు. పొంతనలేని సమాధానాలతో అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. రైతుల పొలాల్లో డ్రిప్ పైపులను అపహరించి అనంతపురంలో విక్రయిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఈ మేరకు 8 మందిని అరెస్టు చేసిన ఎస్ఐ సీఐ ఎదుట వారిని హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒక్కరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. బొలెరో వాహనం (ఏపీ 39యూకే 9000) తో పాటు అందులో ఉన్న రూ. 2,50,000 విలువ చేసే డ్రిప్ పైపులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నరేష్‌తోపాటు సిబ్బందిని సీఐ అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న నాయకులు

డోన్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందజేస్తూ సీఎం జగనన్న పేదల ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. పట్టణ పరిధిలోని 22వ వార్డులో కౌన్సిలర్ శరత్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, అధికారులు, నాయకులతో కలిసి మున్సిపల్ చైర్మన్ కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. దాదాపు 110 గడపలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్దిదారులకు అందజేశారు. అర్హత ఉండి కూడా ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాలు వర్తించకుంటే సచివాలయాల్లో సంప్రదించాలని, ఎవరి ప్రమేయం లేకుండానే న్యాయం జరుగుతందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. చిన్నారులను చదివించే తల్లులు ఏ మాత్రం ఆర్థిక ఇబ్బంది పడకూడదని, అమ్మఒడితోపాటు వసతి, విద్యా దీవెనలు పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. అదేవిధంగా ప్రజారోగ్య సంరక్షణకు అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, రైల్వే నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు పోస్టు ప్రసాద్, ఆర్‌ఈ రాజవర్ధన్, ధారా హరినాథ్‌రెడ్డి, రమణ, శ్రీను, రైల్వే నాయుడు, హౌసింగ్ ఏఈ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: సంజామల మండలం పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో జరిగిన అండర్ -14, 17 విభాగాల్లోని త్రోబాల్, రోప్ స్కిప్పింగ్, టెన్నికాయిట్, బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థులు సంజీవరాయుడు మనోజ్ ఆచారి, దివ్య, హారిక, శ్యామ్, వర్ధిని, కౌసర్, వెంకట నివాస్‌లు ప్రతిభ చాటారన్నారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నంద్యాల, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు వసంతలక్ష్మి, సరోజిని, అనురాధ, చంద్రకళావతి, శంకర్‌రెడ్డి, నరసింహా తదిరులు అభినందించారు.

పాడిరైతులు మెలకువలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ భారతీదేవి

అవుకు: పాడిరైతులు పశువైద్యుల సూచనలు పాటించాలని, పాలదిగుబడిని పెంచుకొనేలా మెలకువలు పాటించాలని డాక్టర్ భారతీదేవి మండల పరిధిలోని మెట్టుపల్లె రైతు భరోసా కేంద్రంలో బుధవారం పాడిరైతులకు పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువులు, జీవాల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అకస్మాత్తుగా పశువులు ఇబ్బందులకు గురైనప్పుడు 1962కు కాల్ చేసి ఉచితంగా అందజేసే పశు అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది హరినాథ్, రైతులు నారాయణ, మద్దిలేటి రెడ్డి, శివశంకర్ రెడ్డి, శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు సహకార సంఘం మాజీ అధ్యక్షురాలు కందుకూరి రామసుబ్బమ్మ(60) బుధవారం మృతిచెందారు. అనారోగ్యంతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృత్యువాత పడింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జున రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ సీజీఆర్ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, గుండం నాగేశ్వరరెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కు మారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

క్రమశిక్షణతో మెలగాలి

డోన్ రూరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ట్రైన్‌పై రాళ్ల రువ్వడం నేరమనే విషయాన్ని తెలుసుకుని మసలుకోవాలని ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వైవీ సుబ్బయ్య సూచించారు. రైలుపై రాళ్లువేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో బుధవారం మండల పరిధిలోని దొరపల్లి ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైళ్లపై సరదాకోసం రాళ్లువేస్తే కేసుల నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడకుండా చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ నాగరాజు, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు



బాధితురాలికి నగదు ఇస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటకు చెందిన ఎగ్గోని పక్కీర్ సాహెబ్ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన తక్షణ సాయం రూ.10వేలను బుధవారం ఎంపీడీఓ సుబ్బరాజు అందజేశారు. ఇటీవల ఫక్కీర్ సాహెబ్ అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రభుత్వం మంజూరు చేసిన తక్షణ సాయాన్ని మృతుని భార్య ఫాతిమాబీకి ఎంపీడీఓ అందజేశారు. అలాగే తిమ్మనాయినపేట, బిఉప్పలూరు, కొలిమిగుండ్ల ఒకటి, రెండవ గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కుమారి, పంచాయితీ సెక్రటరీలు రాజశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, రవికుమార్, హరికృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఈశ్వర్ నాయక్, ఇబ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురానికి చెందిన కంచిపోగు నాగరాజు(28) గుండెపోటుతో మరణించారు. బాధిత కుటుంబానికి బుధవారం సర్పంచ్ ప్రమీలమ్మ, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, భరత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రంగస్వామి వైఎస్సార్ బీమా సాయం రూ. 10 వేలు మృతుని భార్య మనోహరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో వైస్సార్‌సీపీ నాయకులు భరత్ రెడ్డి, సూర్య ప్రకాశ్, హరీష్ రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి



పదోన్నతి ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

అవుకు: విద్యాబుద్ధలు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు ఎన్నటికీ మరువలేనివని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అవుకు మండలంలో 20 మంది ఉపాధ్యాయులకు పదోన్నతి వచ్చిన సందర్భంగా బుధవారం ఎంఈఓ శ్రీధర్ రావు అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. మండలంలో ఏకంగా ఒకేసారి 20 మంది ఉపాధ్యాయులకు పదోన్నతి రావడం ఎంతో సంతోషకరమన్నారు. అనంతరం పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఎంపీపీ, ఎంఈఓ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, ఇసాక్ , భాస్కర్ రెడ్డి, నాగూర్ ప్రసాద్, రామానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి



పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: ప్రజా స్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం అని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురష్కరించుకుని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కుపై ప్రజా సంఘాలు, స్వచ్ఛంధ సంస్థల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు నమోదుకు ప్రతి నాలుగు నెలలకు ఒక సారి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటు విలువపై ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. అనంతరం ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యా సాగర్, వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బానుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: ప్రజాస్వామ్యంలో ఓటే మనకు పదునైన ఆయుధం అని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ అన్నారు. స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంరం తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ మారుతి, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఓటు వజ్రాయుధం లాంటిదని పట్టణ కౌన్సిలర్ షేక్ ముబీనా, మాజీ వార్డు సభ్యులు ఖాజా అన్నారు. బుధవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణంలో వీఆర్వో గోవిందప్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, డిజిటల్ అసిస్టెంట్ హేమలత ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు. దేశ పౌరులుగా నిర్వర్తించాల్సిన బాధ్యతలపై విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

కోవెలకుంట్ల: దేశభవిష్యత్తును నిర్ణయించే ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా అన్నారు. బుధవారం కోవెలకుంట్ల మండలంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలంతో పాటు జిల్లా పరిషత్ బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యదేశంలో ఓటుకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే మండల కేంద్రమైన సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ మల్లికార్జున రావు, డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కోవెలకుంట్ల డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖ్, ఆర్ఐ ఇమ్రాన్, వీఆర్‌ఓలు చెన్నయ్య, రాజశేఖర్‌రెడ్డి, షఫియా, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అవుకు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయ ఆవరణంలో తహసీల్దార్ శ్రీనివాసులు,ఎంపీడీఓ అజాంఖాన్‌లు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ, సమగ్రాభివృద్ధిలో యువతదే ప్రధాన పాత్ర అన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ఐటీఐ కళాశాల విద్యార్థులతో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్ రావు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ బాబు, మండల సర్వేయర్ స్వరూప, ఆర్ఐ వెంగల్ రెడ్డి, ఐటీఐ ప్రిన్సిపల్ నాగరాజు పాల్గొన్నారు.

యువతను మోసగించిన ప్రధాని

డోన్ రూరల్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి యువతను మోసగించారని ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసులు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజినేయులు ఆరోపించారు. హిందూపురం నుంచి ఇచ్చాపురం వరకు ప్రారంభమైన యుజవన విద్యార్థి సంఘాల సమర యాత్ర బుధవారం డోన్ చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక పాతబస్టాండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీతోపాటు విభజన హామీలు నెరవేస్తానని చెప్పి మోదీ మోసం చేశారన్నారు. వీటిని సాధించే వరకు పోరాటం ఆగదని, మోదీని గద్దెదించి తీరుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరాజు, లెనిన్‌బాబు, శివారెడ్డి, రాజేంద్రబాస్కర్, ప్రసాద్‌కుమార్, శ్రీనివాసులు, ధనుంజయ పాల్గొన్నారు.

తపాలా సేవలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బనగానపల్లెరూరల్: తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ శాఖ నంద్యాల జిల్లా సూపరింటెండెంట్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక తపాలాశాఖ కార్యాలయంలో పోస్టు మాస్టర్ మురళీకృష్ణ అధ్యక్షతన ఏజెంట్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తపాలాశాఖపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని, శాఖ నుంచి అందిస్తున్న డిపాజిట్లు, స్కీంల వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఎమ్మెల్సీగా రవీంద్రారెడ్డిని గెలిపించుకుందాం

అవుకు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం ఎంపీపీ ఆధ్వర్యంలో అవుకు పట్టణంలోని ఉపాధ్యాయులకు ప్రచార కర్తలు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తరుపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించుకుంటే ఉపాధ్యాయులకు మరింత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గ ప్రచార కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాలు పంపిణీ

డోన్ : స్థానిక వైఎస్ఆర్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం దాతలు వస్త్రాలు పంపిణీ చేశారు. ప్యాపిలి మండలం ఊటకొండకు చెందిన కమతం పామయ్య, లీలావతి కుమారుడైన దివంగత రామాంజనేయులు మొదటి వర్ధంతి సందర్భంగా అతడి భార్య రాజేశ్వరి వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేశారు. నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు వృద్ధులకు భోజన వసతి కల్పించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

బేతంచెర్ల: స్థానిక నంద్యాల రహదారిలోని పలకచింతమాను ఆంజనేయస్వామి ఆయలం సమీపాన ఆగివున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొంది. నంద్యాల వైపు నుంచి బేతంచెర్ల వైపు వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో వాహనాలు మాత్రం స్వల్పంగా దెబ్బతిన్నాయి.